## మురుగు నీటి సిల్ట్ తొలగింపు పనులు వేగవంతం చేయాలి

- కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**శెనార్తి మీడియా, కరీంనగర్:** వచ్చే వర్షాకాలం ముందు నగరంలోని ప్రధాన స్టాంవాటర్ డ్రైనేజీల నుంచి సిల్ట్‌ను పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉందని, పనులను మరింత వేగంగా పూర్తిచేయాలని కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ స్పష్టం చేశారు. మంగళవారం నగరంలో కమిషనర్ పర్యటించి పలు డివిజన్లలో పారిశుధ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మంకమ్మతోట టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రధాన డ్రైనేజీ వద్ద సిల్ట్ తొలగింపు పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు, సంబంధిత అధికారులకు పనులు వేగవంతంగా కొనసాగించాలని ఆదేశాలు ఇచ్చారు. డ్రైనేజీలో అధికంగా పేరుకుపోయిన సిల్ట్‌ను జేసిబి యంత్రాల సహాయంతో తక్షణమే తొలగించాలన్నారు. అలాగే సిల్ట్‌ను ఎత్తి సుదూర ప్రాంతాలకు తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలానికి ముందు సిల్ట్ తొలగింపు పనులను పూర్తి చేసి, నగర వాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

## రెండో రోజూ ఇంటర్వ్యూలు

**శెనార్తి మీడియా, మంగపేట:** మంగపేట మండలం ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం రెండో రోజు రాజీవ్ యువ వికాసం పథకం ఇంటర్వ్యూలు నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిధిలో 476 మంది సిబిల్ అర్హత పొందిన దరఖాస్తుదారుల్లో 363 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఎస్సీల నుంచి 108 మందికి గాను 92, ఎస్టీలు 66, బీసీలు 189, ఈబీసీలు 9, మైనారిటీలు ఏడుగురు హాజరయ్యారు. మొత్తం 113 మంది ఇంటర్వ్యూకు గైర్హాజరయ్యారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న యూనిట్లపై ఎంపీడీఓ బద్రునాయక్, బ్యాంకు అధికారులు ప్రశ్నలు వేసి, సంబంధిత పత్రాలను పరిశీలించారు.

## మడేలేశ్వర స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి సహకరించాలి.

- ఆలయం వద్ద రజకుల ప్రత్యేక పూజలు



**శెనార్తి మీడియా, చిగురుమామిడి:** మడేలేశ్వర స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి గ్రామస్తులు సహకరించాలని రజక కులస్తులు కోరుతున్నారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామ శివారులోని కట్టపై గల మడేలేశ్వర స్వామి ఆలయం వద్ద వరుకోలు రవీందర్ ఆధ్వర్యంలో రజకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రజక కులస్తులు మాట్లాడుతూ తాక్కల్లా కుంట కట్టపై గత 80ఏళ్ల క్రితం తమ పూర్వీకులు నిర్మించిన మడేలేశ్వర స్వామి ఆలయం పూర్తి శిథిలావస్థకు చేరిందని,దీంతో తాము పునర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు రజకులు తెలిపారు.గ్రామంలోని అన్ని కులాల వారు,అన్ని పార్టీల నాయకులు సహకరించినట్లయితే మడేలేశ్వర స్వామి ఆలయం నిర్మాణం జరుగుతుంద ని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రజక కులస్తులు వరుకోలు సారయ్య,వరుకోలు కనకయ్య, వరుకోలు వెంకటయ్య, వరుకోలు సమ్మయ్య, వరుకోలు కనకయ్య,వరుకోలు పర్శయ్య, వరుకోలు రవి,వరుకోలు రవీందర్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి కృషితోనే రైల్వే స్టేషన్ల అభివృద్ధి



**శెనార్తి మీడియా, జమ్మికుంట:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కృషి చేస్తున్నారని బీజేపీ నాయకులు గట్టు సాయిరాం తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు యూత్ కాంగ్రెస్ నాయకులు పూర్తిగా అవగాహన లేకుండా వ్యహరిస్తున్నారని విమర్శించారు. కొత్తపల్లి నుండి జమ్మికుంటకు బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించాలని కొందరు యూత్ కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ హయాంలోనే రైల్వేల అభివృద్ధికి చేసిందేమీ లేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం ఇవ్వాల్సింది కేంద్రమంత్రి బండి సంజయ్ కు కాదని, సీఎం రేవంత్ రెడ్డికి ఇవ్వాలని సూచించారు. బండి సంజయ్ పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్త గణపతి రెడ్డి, దేవులపల్లి నవీన్, వంశీ, రమేష్, గణేష్, యశ్వంత్ పాల్గొన్నారు.

# భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం



శెనార్తి మీడియా, కరీంనగర్

- కలెక్టర్ పమేల సత్పతి

భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన లైసెన్స్డ్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26 నుండి సుమారు 50 పనిదినాల పాటు 269 మంది లైసెన్స్ డ్ సర్వేయర్లకు శిక్షణను ఇస్తున్నామని అన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. వివిధ సందర్భాలలో ప్రభుత్వ అవసరాల సర్వే సమయంలో సర్వేయర్ల పాత్ర మరువలేనిదని అన్నారు. భూములకు సంబంధించి సర్వేయర్లు వివిధ రకాల సర్వే నిర్వహించాల్సి ఉంటుందని, ప్రభుత్వ భూముల సర్వే, అసైన్డ్ భూముల సర్వే, ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే ,ఎఫ్ లైన్ సర్వే వంటి సర్వేల సమయంలో సర్వేయర్లు ముఖ్యపాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు. ప్రత్యేకించి రెవెన్యూ కు సంబంధించి గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, అలాగే అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారానికి నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు. అందువలన సర్వేయర్లు శిక్షణకు క్రమం తప్పకుండా హాజరై జాగ్రత్తగా అన్ని అంశాలను క్షుణ్ణంగా విని అర్థం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో రైతులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందిన వారికి సర్వే పనులు లభిస్తాయని తెలిపారు. గత రికార్డులను పరిశీలిస్తూ క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి సర్వే విధానాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శిక్షణ పొందుతున్న సర్వేయర్ల కు సర్వే సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు కృషి చేయాలి

శెనార్తి మీడియా, తిమ్మాపూర్



కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ మంగళవారం నాడు తిమ్మాపూర్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ స్థాయి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టమ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, సీసీసీ ద్వారా వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని సీపీ ఆదేశించారు.స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లను తరచుగా సందర్శిస్తూ, ఎస్సైల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో రూరల్ ఏసిపి ఏఎస్పీ శుభం ప్రకాష్, తిమ్మాపూర్ ఇన్‌స్పెక్టర్ జి సదన్ కుమార్, ఎస్సైలు వివేక్ , శ్రీనివాస్ , నరేష్ ప్రొబేషనరీ ఎస్సైలు అరుణ్, క్రాంతి, జగదీశ్ పాల్గొన్నారు.

## పరస్పర సహకారంతో మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ప్రజావాణిలో ఫిర్యాదుపై ఇందుర్తిలో ఎఫ్డిఓ విచారణ...

శెనార్తి మీడియా, చిగురుమామిడి




మత్స్యకారులు పరస్పర సహకారంతో ఆర్థికాఅభివృద్ధి సాధించాలని, ఐకమత్యంతో సంఘాన్ని ఆదర్శంగా నిలుపుకోవాలని జిల్లా మత్స్య అభివృద్ధి శాఖ అధికారి (ఎఫ్ డి ఓ) మంజుల పిలుపునిచ్చారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని మత్స్య పరిశ్రమక సహకార సంఘం భవనంలో మాజీ అధ్యక్షులు గౌరవేనీ కనకయ్య,లింగమూర్తి, తిరుపతి,కూన కృష్ణం రాజులు ఈనెల 19న ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం మత్స్యకారుల అందరి సమక్షంలో ఎఫ్డిఓ మంజుల విచారణ చేపట్టారు.అనంతరం ఎఫ్ డి ఓ మంజుల మాట్లాడుతూ సంఘంలో తప్పకుండా సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలని,సంఘంలో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికి చేపలు విక్రయించగా వచ్చిన వాటాదనాన్ని పంపిణీ చేయాలని అధ్యక్షులకు ఆదేశించినట్లు చెప్పారు.వాటా దనం పంపిణీ చేశాకే మెజార్టీ సభ్యుల ఆమోదమేరకే చేపలను పట్టే కార్యక్రమానికి తీర్మానం చేయాలన్నారు.సంఘం డబ్బులతో కొనుగోలు చేసిన 2గుంటల భూమి విషయమై మరొకసారి మాజీఅధ్యక్షులు,పాలకవర్గ సభ్యుల సమక్షంలో సమావేశమై చర్చించుకొని సమస్యను పరిష్కరించుకోవాలని వారికి చెప్పినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫిషరీస్ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకృష్ణ,సంఘం అధ్యక్షులు గట్టు శ్రీనివాస్,కార్యదర్శి కూన ముత్తయ్య,ఉపాధ్యక్షులు బొల్లి రాజయ్య, మాజీ అధ్యక్షులు కునచ్చుల మహేందర్,సంఘం డైరెక్టర్లు,మత్స్యకారులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన వంట కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



శెనార్తి మీడియా, మంగపేట

పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని మార్చాలని, కనీస వేతనం ఇవ్వాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మంగపేట హైస్కూల్ ఆవరణంలో యూనియన్ మండల జనరల్ బాడీ సమావేశం గడ్డం భారతి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నెలకు కేవలం రూ.600 మాత్రమే వేతనం చెల్లిస్తూ వంటకార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందని విమర్శించారు. 60-40 నిధుల పంచకం ప్రకారం వేతనాన్ని రూ.8000 చెల్లించాల్సి ఉంటే, కేవలం రూ.600 మాత్రమే ఇచ్చి కేంద్రం చేతులు దులుపుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పోరాటాల ఫలితంగా అదనంగా రూ.2000 ఇస్తున్నప్పటికీ, కేంద్రం తన వంతు రూ.5600 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో గడ్డం భారతి, కురుసం రాజకుమారి, కోరెం పద్మ, బండి జయమ్మ, కొడాలి తులసి, షఫియాభి, ఫయాంభీ, సిర్ర సమ్మక్క, రేష పాపమ్మ, తడికెల సత్యవతి, కర్రె సుశీల, జోగ దివ్యభారతి, పోధెం సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

## శేఖర్ కుటుంబానికి అండగా ఉంటాం

శెనార్తి మీడియా, యాదాద్రి భువనగిరి:

- అక్షర కాన్సెప్ట్ హై స్కూల్ ప్రిన్సిపల్ రాజిరెడ్డి

ఇటీవల కాలంలో అకాల మరణం పొందిన ప్రజ్ఞాపూర్ శేఖర్ కుటుంబానికి అండగా నిలబడతామని అక్షర కాన్సెప్ట్ హై స్కూల్ ప్రిన్సిపల్ రాజిరెడ్డి తెలిపారు. సోమవారం శ్రీ పోచమ్మ తల్లి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు శేఖర్ పిల్లలకు ఉచిత విద్యను అందించవలసిందని అక్షర కాన్సెప్ట్ హై స్కూల్ ప్రిన్సిపల్ రాజిరెడ్డి ని ఫోన్ ద్వారా కోరడం జరిగింది.ఈ మేరకు శేఖర్ ఇద్దరు పిల్లలకు ఈ విద్యా సంవత్సరం నుండి 10వ తరగతి వరకు తమ విద్య సంస్థలో ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్ట సమయంలో ఉన్న కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని అన్నారు. విద్య అనేది విద్యార్థుల ప్రాథమిక హక్కు అని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివినప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. శేఖర్ పిల్లలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

## ప్రమాదపుటంచున ప్రయాణం

- పట్టించుకోని అధికారులు
- రోడ్డు మరమ్మతు చేయాలని గిరిజనుల డిమాండ్

శెనార్తి మీడియా, మంగపేట



మంగపేట మండలం కొత్తచీపురుదుబ్బ గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రమాదాలకు అడ్డాగా మారింది. గత ఏడాది వర్షాల్లో రోడ్డు ఎడ్జ్ పూర్తిగా కోతకు గురై, చీకటి వేళ వాహనదారులు ప్రమాదాల్లో పడుతున్నారు. ఇప్పటికే పలువురు గాయపడి ప్రాణాపాయ స్థితికి చేరినా అధికారులు కనీస స్పందన చూపించకపోవడం గమనార్హం.ఎన్నిసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పనికి రాకపోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ వర్షాకాలం మొదలైన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారే ప్రమాదం ఉందని, వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. లేకపోతే గ్రామానికి రాకపోకలు నిలిచిపోయే స్థితి ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు.తక్షణమే రోడ్డు ఎడ్జ్ కు మట్టి వేసి చదును చేయాలని, సమస్యను ఇక అలసత్వంగా తీసుకుంటే తీవ్ర నిరసనలు చేస్తామని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలను గిరిజన గ్రామ ప్రజలు హెచ్చరించారు.

## 31న ఛలో వరంగల్ సభను విజయవంతం చేయండి



శెనార్తి మీడియా, మంగపేట

పద్మశ్రీ పురస్కార గ్రహీత మంద కృష్ణ మాదిగకు ఘనంగా స్వాగతం పలకాలని, 31న వరంగల్ నగరంలో జరగనున్న సభను ఘనవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈనెల 31న ఢిల్లీ నుంచి వస్తున్న మంద కృష్ణ మాదిగకు ఉదయం 10 గంటలకు వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద స్వాగతం, అనంతరం హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో జాతీయ కార్యవర్గ సదస్సు నిర్వహించనున్నట్టు ప్రకటించారు.అనుబంధ సంఘాల నాయకులు, కళాకారులు, కవులు, విద్యార్థులు, మేధావులు పెద్ద ఎత్తున హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎస్పి జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి కరుణాకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ళ సురేష్ మాదిగ, మండల అధ్యక్షుడు ఇసంపల్లి సురేందర్ మాదిగ, పెద్ద శ్రీను, చిన్న శ్రీనివాస్ మాదిగ, సారయ్య మాదిగ, గోనె నాగేష్ మాదిగ, తాటి నాగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.50 వేల సాయం



శెనార్తి మీడియా, యాదాద్రి భువనగిరి

అనారోగ్యంతో మరణించిన ప్రజ్ఞాపురం శేఖర్ కుటుంబానికి శ్రీ పోచమ్మ తల్లి గణేష్ ఉత్సవ కమిటీ రూ.50,116 నగదు సహాయాన్ని అందించింది. సోమవారం కమిటీ గౌరవ అధ్యక్షుడు ఏనుగు సోమయ్య ఈ సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా శేఖర్ మరణం తీరని లోటుగా పేర్కొంటూ, గ్రామస్తులు ఏ విభేదాలు లేకుండా బాధిత కుటుంబానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఎవరికైనా సమస్య వచ్చినా తమ కమిటీ ముందుండి సహాయం చేస్తుందని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏనుగు మహేందర్, ప్రజ్ఞాపురం కృష్ణహరి, ఆడెపు అశోక్, ఏనుగు శ్రీనివాస్, పోలాస్ వినోద్, నారెడ్డి నరేష్, చెన్నూరి గౌతమ్, కాళీ మధు తదితరులు పాల్గొన్నారు.

## 'రాజీవ్ యువ వికాసం' అర్హులందరికీ వర్తింపజేయాలి

శెనార్తి మీడియా, గన్నేరువరం



రాజీవ్ యువ వికాసం పథకాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ నాయకుడు నూకల చింటూ పేర్కొన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ పథకం ద్వారా లబ్ధి పొందాల్సింది సామాన్య ప్రజలేనని, ఆపార్టీ నాయకులు తమ కార్యకర్తల పేర్లను లిస్టుల్లో చేర్పించి అధికారులకు పంపిస్తున్న పరిస్థితిని చూస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమేనన్నారు. అర్హతల ప్రమాణాలు పాటించి, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు.అవినీతి, పక్షపాతం లేకుండా నిస్పక్షపాతంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని, ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా అధికార యంత్రాంగం పనిచేయాలని నూకల చింటూ పేర్కొన్నారు.